నేటి దినపత్రిక
సూర్య
17వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 25 ఆగస్టు 2024 | పేజీలు 8




## డీఎస్పీని ఢీకొట్టిన వాహనం

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- వాహనంతోపాటు నిందితున్ని పట్టుకున్న పోలీసులు

వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన


## ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు



2 లో

## అన్నా క్యాంటీన్లకు రూ.50 వేల వితరణ

### అందజేసిన బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపు మేరకు సీనియర్ నేత బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్ అన్నా క్యాంటీన్లకు సంబంధించి రూ.50 వేలను వితరణగా అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ మేరకు రూ.50 వేల చెక్కును కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపు మేరకు తనవంతు సహాయంగా అన్నా క్యాంటీన్లకు ఈ రూ.50 వేలను అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన

## కావలి ఎడవల్లి హైస్కూల్ విద్యార్థిని



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి ఎడవల్లి జడ్పీ హైస్కూల్లో గత ఏడాది 10వ తరగతి చదివిన బందా హరిణికి మూడవ విడతలో శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు లు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన బందా హరిణిని అభినందించారు.

- బీచ్‌లకు సందర్శకుల తాకిడి

చిన్నారుల కేరింతలు.. బోటు షికారు హుషారు



# సందడే సందడి..

**గతంలో సెలవులు ఇస్తే.. హోటళ్ళు, సినిమాలకు వెళ్ళేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పిల్లలకు సెలవులు ఇస్తే చాలు.. బీచ్‌లకు పరుగులు తీస్తున్నారు.**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :**

జిల్లా పరిధిలో సముద్రతీర ప్రాంతం ఎక్కువగా ఉండటంతో బీచ్‌లు కూడా ఎక్కువే. సెలవులు వస్తే చాలు ఇంటిల్లిపాది వెళ్లి.. ఎంజాయ్ చేస్తుంటారు. మరో కోనసీమగా పేరుగాంచిన ఇందుకూరుపేట మండలం మీదుగా బీచ్‌కి వెళ్తుంటే ఆ అనుభూతిని వర్ణించలేం.. ఆదివారం, సెలవు రోజులు వస్తే చాలు.. బీచ్‌లు సందడిగా మారుతాయి. తడ నుంచి ఉలవపాడు వరకు బీచ్‌లు ఉండడం విశేషం. వాకాడు తూపిలిపాలెం, ముత్తుకూరు, కృష్ణపట్నం, కొత్తకోడూరు, మైపాడు, కాటపల్లి, కొత్తపట్నం, జువ్వలదిన్నె, రామతీర్థం, తుమ్మలపెంట, రామాయపట్నం బీచ్‌లు సందర్శకులకు అనుకూలంగా ఉంటాయి. సముద్రతీరంలో సూర్యోదయాన్నీ చూడటానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. ఎండ వేడిమి నుంచి తప్పించుకోవడానికి ఉదయాన్నే బీచ్‌ల వద్దకు చేరుకుంటున్నారు. కొందరైతే ఇంటి వద్ద నుంచే టిఫిన్, భోజనాలు తమ వెంట తీసుకెళ్లి సాయంత్రం వరకు సరదాగా గడిపి వస్తున్నారు. ఇదిలా ఉండగా.. మైపాడు బీచ్ కిక్కిరిసిపోతుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో అన్ని వసతులు ఉండడంతో అధికంగా వెళ్తుంటారు. గెస్ట్‌హౌస్, మీటింగ్, బర్త్ డే, ఫంక్షన్లు చేసుకోవడానికి రూములు అందుబాటులో ఉదడమే కాకుండా ప్రముఖ దేవాలయాలు కూడా ఉన్నాయి. మైపాడు సాగరతీరం రమణీయ ప్రకృతి దృశ్యాల సమాహారం. మరో కోనసీమగా పేరుగాంచిన ఇందుకూరుపేట మండలంలోని మైపాడుకు జిల్లా కేంద్రం నుండి ప్రయాణించడం గొప్ప అనుభూతి. పచ్చని వరిపొలాలు, కొబ్బరి తోటలు దారంతా పలకరిస్తాయి. మైపాడు పర్యాటక కేంద్రంలో విశాలమైన స్థలం, పిల్లలు ఆడుకోడానికి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కృష్ణపట్నం ప్రాంతం పర్యాటకంగానూ ప్రసిద్ధి పొందుతోంది. డీప్‌వాటర్ పోర్టుగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్టుతోపాటు కృష్ణపట్నం గ్రామంలో శతాబ్దాల కాలం నాటి సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ఈ ఆలయాన్ని క్రీ.శ.1270వ సంవత్సరంలోనే మనుమసిద్ధి మహారాజు పునర్నిర్మించినట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయ మండపంలోని స్తంభాలపై అద్భుతమైన శిల్పాలు

-మిగతా 2లో

- నిరుపయోగంగా దోబీఘాట్
- పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- మందుబాబులకు నిలయంగా దోబీఘాట్

### లక్షలు ఖర్చు పెట్టారు..

# లక్షణంగా వదిలేశారు !



**కొండాపురం, మేజర్‌న్యూస్ :**

ఒకటికి రెండుసార్లు దోబీఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మొదటిసారి దోబీఘాట్ నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేశారు. ఆ నిధులు సరిపోకపోవడంతో రెండోసారి బీసీ కార్పొరేషన్ ద్వారా ఏకంగా రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కొండాపురంలో దోబీ ఘాట్ నిర్మాణం పూర్తయింది. అయితే నిర్మించిన ఈ దోబీ ఘాట్ గత 8 ఏళ్లకు పైగా నిరుపయోగంగా ఉంది. కొండాపురం గ్రామంలో 60 కుటుంబాల వారు రజక వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నారు. రజకులు ఒక్కరు కూడా బట్టలు శుభ్రపరిచేందుకు ఈ దోబీఘాట్‌ను ఉపయోగించుకున్న సందర్భం లేదు. అధికారులు మాత్రం నిర్మాణం పూర్తయిన తర్వాత రజకులు దీని ఉపయోగిస్తున్నారా.. లేదా.. అని పట్టించుకున్న నాథుడే లేరు. దీంతో దోబీఘాట్ చుట్టూ కంప్ర తుమ్మచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పరిసర ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. బట్టలు శుభ్రపరిచేందుకు నిర్మించిన తొట్లన్నీ మందుసీసాలతో

-మిగతా 2లో

సూర్య 18వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బడుగు, బలహీన వర్గాల ఆశయ సాధనకు అక్షరాన్ని ఆయుధంగా మలుచుతూ...
ప్రజల పక్షాన నిలుస్తూ... మీడియా రంగంలో సరికొత్త నిర్వచనం
దిశగా దూసుకువెళ్తున్న... నేటి దిన పత్రిక సూర్య కు
18వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వుంటున్న
నేటి దిన పత్రిక సూర్య మరింతగా దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ...
హేమంత్ కుమార్ తహసీల్దార్
భరత్ డిప్యూటీ తహసీల్దార్
వీఆర్ఓలు జలదంకి మండలం.

# స్తంభాలే మిగిలిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు



**కొండాపురం, మేజర్‌న్యూస్ :** గ్రామం శుభ్రంగా ఉండడంతోపాటు గ్రామ పంచాయితీలకు అదనపు ఆదాయం అందాలనే లక్ష్యంతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఇండ్ల నుండి సేకరించిన తడి, పొడి వ్యర్థాలతో ఎరువు తయారు చేయడం, ఆ ఎరువులు రైతులకు విక్రయించడం. జరగాలి. అయితే మండలంలోని పార్లపల్లి, భీమవరప్పాడు గ్రామాలలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు అధికారుల ఉదాహరణతో లక్ష్యం నెరవేరడం లేదు. 2017లో రూ.3.48 లక్షల అంచనా విలువతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ హామీ పథకంలో భాగంగా పార్లపల్లి గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పనులను ప్రారంభించారు. 199 పనిదినాలలో 2018లో ఈ పనిని ముగించారు. కొన్నాళ్లపాటు నిర్వహణ సజావుగా సాగింది. తుఫాను సమయంలో ఈదురు గాలులకు తయారీ కేంద్రంపై వేసిన కొన్ని రేకులు ఎగిరిపోయాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో మిగిలి ఉన్న రేకులు ఒక్కొక్కటిగా కనుమరుగయ్యాయి. సంపద తయారీ నిలిచిపోయింది. ప్రస్తుతం స్తంభాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతాలన్నీ కంప చెట్లతో కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుచున్నారు.

# వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు





**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని గొలగమూడి క్షేత్రంలో భగవాన్ శ్రీవెంకయ్య స్వామి వారి 42వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వెంకయ్యస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. ఆంజనేయస్వామి దర్శనం అనంతరం పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించే మహద్భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. భగవాన్ వెంకయ్యస్వామి, ఆంజనేయస్వామి ఆశీస్సులతో పాటు సకల దేవతల దీవెనలు, ప్రజల అండదండలతో ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించానన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నానని, శ్రీవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# డీఎస్పీని ఢీకొట్టిన వాహనం - తృటిలో తప్పిన పెను ప్రమాదం

## వాహనంతోపాటు నిందితున్ని పట్టుకున్న పోలీసులు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారిపై బొలెరో వాహనంలో భారీ ఎత్తున గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రాత్రి డ్యూటీలో ఉన్న నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటాచలం సీఐ సుబ్బారావు, మనుబోలు ఎస్ఐ అజయ్‌తోపాటు మరి కొంత మంది పోలీస్ సిబ్బంది రాత్రి సుమారు ఒకటిన్నర ప్రాంతంలో నెల్లూరు జిల్లా వెంకటా చలం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా అటు గా వచ్చిన ఓ బోలోరో వాహనాన్ని డీఎస్పీ ఆపి ఆరా తీస్తుండగా.. అంతలోపే నిందితుడు ఒక్కసారిగా వాహనాన్ని ముందుకుపోనివ్వడంతో డీఎస్పీ అదుపు తప్పి కిందపడిపోయారు. డీఎస్పీ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో పోలీసులు ఒక్కసారి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ క్రమంలో నిందితుడు అతివేగంగా టోల్‌ప్లాజా ను ఢీ కొట్టి గూడూరు వైపు వెళ్లిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు నిందితుడు వాహనానికి సంబంధించిన సమాచారం అన్ని పోలీస్ స్టేషన్‌లకు అందివ్వడంతో పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు మనుబోలు సమీపంలోని కాగితాలు పూర్ రోడ్డు మీదుగా పొదలకూరు, సంఘం, ఆత్మకూరు మీదుగా మర్రిపాడు సమీపిస్తుండగా అప్పటికే వాహన తనిఖీలు చేపట్టిన ఆత్మకూరు సీఐ బోలోరో వాహనాన్ని గుర్తించి ఆపబోగా, అక్కడ కూడా వాహనాన్ని అతివేగంగా నడపడం తో ఆత్మకూరు సీఐ తన వాహనంతో వెంబడించారు. ఈ క్రమంలో చాలా దూరం ఛేజింగ్ చేసి న తర్వాత ఆత్మకూరు పోలీసుల వాహనాలు నిందితుడి వాహనాన్ని అడ్డుకున్నాయి. ఈ క్రమం లోనే ఆత్మకూరు సీఐ వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు సైడ్‌కు వెళ్లిపోయింది. అయితే వాహనంలో ఉన్న సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదు. నిందితుడు ఉపయోగించిన బోలోరో వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని పట్టుకుని విచారించారు. ప్రాథమిక సమాచారం మేరకు నిందితుడు రాజమండ్రి సమీపంలోని రాజానగరంకు చెందిన సూర్యనారాయణగా గుర్తించారు. పట్టుబడిన బోలోరో వాహనంలో ఎలాంటి గంజాయి లభించకపోవడంతో మార్గమధ్యంలో నిందితుడు ఎక్కడైనా ఈ గంజాయిని దించివేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మరింత సమాచారం పోలీసులు తెలపాల్సి ఉంది.

# సందడే సందడి

(మొదటి పేజీ తరువాయి)



కనువిందు చేస్తాయి. ఈ పురాతనమైన రేవుపట్నం సహజమైంది.. పరిశుభ్రమైన వాతావరణంతో ఉంటుంది. విశాలమైన ఇసుక తిన్నెలతో, పచ్చటి కొబ్బరి చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. రణగొణ ధ్వనులతో కూడిన పట్టణ జీవితం నుండి ప్రశాంతంగా గడపటానికి అనుకూలమైన ప్రదేశం. బీచ్‌కి వెళ్లే దారిలో ఉన్న కృష్ణపట్నం లైట్‌హౌస్ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఈ లైట్‌హౌస్ పైనుంచి కృష్ణపట్నం పోర్టు, పరిసర ప్రాంతాలను చూడవచ్చు. కృష్ణపట్నం పోర్టులో పర్యటించేందుకు, లైట్ హౌస్ ఎక్కేందుకు ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త కోడూరు బీచ్‌కు సముద్రంలో బోట్ షికారు ఒక మధురమైన అనుభూతి. ఇక్కడున్న చిన్న చిన్న పలహారశాలలో చేపలతో చేసిన రుచికరమైన వంటకాలు రుచి చూడవచ్చు. సముద్రతీరంలోనే ప్రసిద్ధి చెందిన వేళంగిని మాత చర్చి కలదు.

తుమ్మలపెంట తీరంలో సముద్రపు ఒడ్డున ఏపీ టూరిజం శాఖ నిర్మించిన హరిత బీచ్ రిసార్ట్స్ సందర్శకులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. తీరప్రాంతంలో ప్రక్కనే సముద్రం ఉండటంతో ఆ పర్యాటక కేంద్రానికి వారాంతాలలో, సెలవు దినాలలో ఎక్కువగా పర్యాటకులు వస్తారు. పన్నెండు ఏసీ గదులు, ఒక రెస్టారెంట్ పర్యాటకుల కోసం ఉన్నాయి. పర్యాటక కేంద్రంలో పిల్లల కోసం ఊయల, జారుడుబల్ల, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు.

## ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సౌత్ ఆములూరులో శనివారం ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్. అహ్మద్‌బాషా మాట్లాడుతూ.. పాఠశాలలో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. పిల్లల కృష్ణుని, గోపికల వేశాధారణలు అలరించాయి. అనంతరం విద్యార్థుల నిర్వహించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయురాలు కె.వసంతలక్ష్మి తన పెళ్లిరోజు సందర్భంగా విద్యార్థులకు శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు రిఫ్రెష్‌మెంట్ మిఠాయిలు, పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ వి.గిరిజ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు కె.విద్యుల్లత, బి.కృష్ణవేణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్షలు ఖర్చు పెట్టారు.. లక్షణంగా వదిలేశారు !

(మొదటి పేజీ తరువాయి)

నిండి పోయాయి. కొంత మంది విమర్శకులు మాట్లాడుతూ.. వీటి కోసం ఖర్చు చేసిన రూ.6 లక్షలు రక్షిత మంచినీటి సరఫరాకు ఖర్చు చేసి ఉంటే బాగుండేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోబీఘాట్‌ను ఉపయో గంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# లెప్రసీ మహిళకు డేమియన్ ఫౌండేషన్ అర్బన్ ఆర్థిక సహాయం




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మల్లికార్జునపురం మజర గ్రామమైన మాచర్లవారిపాలెంలో ఉన్న గణపతినగర్‌లో శనివారం డేమియన్ ఫౌండేషన్ లెప్రసీ వారు, గోడ విజయమ్మకు ఉచితంగా చిల్లర దుకాణాకు 45 వేల రూపాయలను సహాయంగా ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య, సహా అధికారి ఎస్‌కె ఖాజావలి, ప్రాజెక్టు మేనేజర్ సతీష్ పాల్గొని, చిల్లర దుకాణకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరి గొండ వైద్యాధికారిణి డాక్టర్ రాధిక మాట్లాడుతూ.. లెప్రసీ కారణంగా బాధ పడుతున్న గోడా విజయమ్మకు ఫౌండేషన్ వారు చిల్లర దుకాణకు సహాయం చేయడం చాలా సంతోషకరంగా ఉందని, దీంతో ఆమెకు పోషణ నిమిత్తం ఆర్థికంగా ఇబ్బందు లేకుండా ఉంటుందని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ప్రసాద్ ఆచారి, ఓ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జనవాణితో సమస్యల సత్వర పరిష్కారం

- ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోండి
- జనసేన పార్టీ నేత నూనె మల్లికార్జున్ యాదవ్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు శనివారం స్థానిక గోమతి నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. దీర్ఘకా లిక సమస్యల పరిష్కారం కోసం జనవాణి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల మంచి మనసుకు ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ప్రజల వద్దకే పాలన సాగించటం అభినందనీయమన్నారు. పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్ శ్రీరామ్, కృష్ణారెడ్డి, రాజేష్, చంద్రశేఖర్, కొట్టే వెంకటేశ్వర్లు, నందిని, భవాని సురేష్, హరి రెడ్డి, జమీర్, రాము, పవన్, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన 10 తరగతి పరీక్షలలలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన స్నేహిత, వర్షిత లకు రూ.10వేలు, రూ.5 వేలు వంతున ఇర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న కటారి సుధాకర్, మౌనిక దంపతులు మర్రిపాడు మండల విద్యాశాఖాధికారి-2 ధనలక్ష్మి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. అనంతరం వారి కుమార్తె శ్రీయాన్ని పుట్టినరోజు సందర్భంగా శుభ్ దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత మాట్లాడుతూ.. గతంలో సుధాకర్ ఈ పాఠశాలలో పని చేసే సమయంలో 10 తరగతి విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇచ్చిన హామీ మేరకు నగదు బహుమతులు పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. మండల విద్యాశాఖాధికారి-2 ధనలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావడం శుభ పరిణామమని, విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని, బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా నగదు బహుమతులు ప్రధానం చేసిన దాతలు సుధాకర్, మౌనిక దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీయాన్ని పుట్టినరోజు వేడుకలను పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మండలంలో కనియంపాడు గ్రామంలో శనివారం పశుసంవర్ధక వైద్యులు రాఘవేంద్రశర్మ ఆదేశాల గ్రామంలో వెయ్యికి పైగా ఉన్న పశవులకు గాలికుంటు వ్యాధి నివారణ 501 టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి సుబ్బారాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ.. పశు సంపద పరిరక్షణ దిశగా గ్రామాలలో పర్యటిస్తూ పశువులలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు టీకాల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధి లక్షణాలు మార్చి, ఏప్రిల్, ఆగష్టు మాసాలలో అఫ్తోస్ వైరస్ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెంది ఆవులు, గేదెలు పాల ద్వార దూడలకు వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి వలన పశువుల నోటిలో, చిగుళ్ళుపై పొక్కులు ఏర్పడటం వల్ల మేత, నీళ్ళు తీసుకోలేక నీరసించిపోతాయన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాధి సోకిన పశువులను వెంటనే వేరు చేయాల్సి ఉంటుందన్నారు. పశువుల పాకను క్రిమిసంహారక మందులతో, వాషింగ్ సోడాతో కడగాలని తెలియజేశారు. ఎప్పటికప్పుడు పశు వైద్య సిబ్బందిని సంప్రదించి అవసరమైన యాంటిబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కొండేపోగు



దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. పశువులు కలిగిన ప్రతి యజమాని అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి బాగా పని చేస్తున్నారని సర్పంచ్ వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏహెచ్ సుబ్బారాయుడు, వీఏ హర్షద్ అలీ, ఓఎస్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను అగౌరవ పరచలేదు : స్పష్టం చేసిన టీడీపీ నాయకులు

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని దండిగుంట గ్రామంలో జరిగిన గ్రామసభ సమయంలో ఆ గ్రామ సర్పంచ్‌ను టీడీపీ నాయకులు అగౌరవ పరచినట్లు వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపులో భాగంగా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్‌ను ఆహ్వానించలేదని, సర్పంచ్‌కు తెలియకుండానే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. గ్రామసభ 2.30 గంటలకు ప్రారంభమైతే సర్పంచ్ 3.20 గంటలకు వచ్చిందని గుర్తు చేశారు. ఆ సమయంలో వచ్చిన సర్పంచులు గ్రామంలో అభివృద్ధి జరగలేదని అడిగామే తప్ప ఎక్కడ అగౌరవ పరచలేదని తెలిపారు. అయితే సర్పంచ్ భర్త గ్రామసభను పక్కదారి పట్టించారని, ఉద్దేశపూర్వకంగానే టీడీపీ నాయకులపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు.



రానున్న కాలంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో దండిగుంట గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణానికి మేకపాటి విక్రంరెడ్డి

# రూ.10 లక్షల ఆర్థిక సాయం

### నిర్మాణ పనులు పరిశీలించిన కంటాభత్తిన రఘునాథరెడ్డి



**సంగం, మేజర్‌న్యూస్ :** సంగం మండలం జెండదిబ్బ గ్రామంలోని మసీద్ ఏర్పాటుకు సార్వత్రిక ఎన్నికల ముందు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మసీద్ నిర్మాణానికి 10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. శనివారం ఆ మసీదు నిర్మాణం స్లాబ్ నిర్మాణం చేపట్టడంతో జెండా దెబ్బ వైసీపీ నాయకుల ఆహ్వానం సంఘం మండల ఎంపీపీ కంటాభత్తిన రఘునాథరెడ్డి గ్రామానికి విచ్చేసి మసీదు నిర్మాణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జండా దెబ్బ వైసీపీ నాయకులు, ముస్లిం సోదరులు కంఠాభత్తిన రఘునాథ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మసీదు నిర్మాణానికి సహాయం చేసిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి జండా దిబ్బ ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జండా దిబ్బ ఉప సర్పంచ్ నరేష్ గుప్తా, కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, ఖాదర్ బాషా, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవం

### భక్తులకు అన్నదానం కార్యక్రమం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం క్రిష్ణపాడు గ్రామంలోని శ్రీకృష్ణ మందిర్ ఆశ్రయంలో వెలసి భగవాన్ వెంకయ్యస్వామికి శనివారం గ్రామస్తులందరూ కలిసి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా గ్రామస్తుల సహాయ సహకారాలతో ఐక్యంగా సమిష్టిగా ఈ ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారికి హోమగుండం ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తులందరూ భజన కార్యక్రమం, కోలాటంలో పాల్గొన్నారు. భక్తులందరికి అన్నదానంతోపాటు ప్రసాదాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించిన క్రిష్ణపాడు యువజన సంఘానికి, అన్నదాన కార్యక్రమానికి చేదోడుగా ఉన్న గ్రామస్తులకు, మహోత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మా హయాంలోనే గ్రామాభివృద్ధి

### టీడీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరించారు



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని దండిగుంట గ్రామంలో అభివృద్ధి జరిగిందని వైసీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్ అన్నారు. ఆయన స్థానిక సర్పంచ్ బెల్లంకొండ సుప్రజాతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభ సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ ఏక వచనంతో మహిళా సర్పంచిని అగౌరవపరిచారని గుర్తు చేశారు. గత మూడున్నర ఏళ్లుగా తమ సొంత నిధులతో కూడా గ్రామ అభివృద్ధికి చొరవ తీసుకున్నామని, దీనిని గుర్తించలేని టీడీపీ నాయకులు ఎక్కడ అభివృద్ధి జరిగిందని ప్రశ్నించడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్లను, వీధి దీపాల నిర్వహణ విషయంలో ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. గ్రామంలో చెత్త లేకుండా క్లీన్ చేయడం జరిగిందన్నారు. చెత్తను తరలించే వాహనంలో లేకపోయినప్పటికీ ఉన్న ఒక్క వాహనంలోనే చెత్తను పూర్తిగా తీసివేశామన్నారు. అయితే టీడీపీ నాయకులు ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం గ్రామసభను భ్రష్టు పట్టించాలన్న ఉద్దేశంతోనే దౌర్జన్యం చేసి రసాభసా చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాగర మాల ప్రాజెక్టు పీఆర్‌ఓ పై పంటపాలెం రైతులు ఆగ్రహం

- నష్ట పరిహారం కోసం రైతులు ఆందోళన
- రెవిన్యూ చుట్టూ తిరగాలని పీఆర్‌ఓ సలహా
- భూములిచ్చి మాకేం కర్మంటూ రైతులు కన్నీళ్లు
- పనులు ఆపాలంటూ రైతులు డిమాండ్
- ఆగేది లేదంటున్న సాగర మాల ప్రాజెక్టు
- లంబాడి భూముల పరిహారంపై రైతులు పోరాటానికి సిద్ధం
- రైతు ఉద్యమ నాయకులు తిన్నెల పూడి సిద్దు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సాగరమాల ప్రాజెక్టు రోడ్డు నిర్మాణానికి సంబంధించి పనులు పర్యవేక్షణ చేస్తున్న ప్రాజెక్టు ప్రజా సంబంధాల అధికారి ప్రవీణ్‌పై రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన పంటపాలెం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన శనివారం ఆ పంచాయతీ పరిధిలోని నారాయణవనం గ్రామ సమీపాన లంబాడి భూముల్లో చోటుచేసుకుంది. సర్వే నెంబర్ 440లో ఉన్నటువంటి 14 ఎకరాల లంబాడి భూముల్లో మూడు ఎకరాలు భూమి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకోవడంతో ఈ భూములకు పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణపనులు చేయడంపై సాగుదారులు ఆందోళనబాట పట్టారు. ఈ నేపథ్యంలో 50 మంది రైతులు ఈ భూముల్లో దిగి నిరసన వ్యక్తం చేశారు. రైతు ఉద్యమ నాయకులు, అధికార పార్టీ నేత తిన్నెలపూడి సిద్దు రైతుల పోరాటానికి అండగా నిలిచారు. ఆయన ఆధ్వర్యంలోనే రైతులు తిరుగుబాటు చేసి సాగరమాల ప్రాజెక్టు రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకున్నారు. కోల్పోయిన భూములకు నష్ట పరిహారం ఇచ్చేంతవరకు పనులు నిలిపివేస్తామని చెప్పారు. మండుటెండలో రైతులు నిరసన వ్యక్తం చేయగా విషయం తెలుసుకున్న ప్రాజెక్టు అధికారులు రైతులు వద్దకు వచ్చారు. పరిహారం ఇవ్వాలి రైతులకు న్యాయం చేయాలంటూ రైతులు నినాదం చేయడంతో ప్రాజెక్ట్ పిఆర్ఓ రైతులతో చర్చించారు. రైతులతో మాట్లాడి తీరుపై అక్కడ నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి.

### రైతులు రెవెన్యూ చుట్టూ తిరిగితే పరిహారం

**భూములు ఇచ్చి మేము ఎందుకు తిరగాలి?**

సాగర మాల ప్రాజెక్ట్ రోడ్డు నిర్మాణాలకి భూములు కోల్పోయిన లంబాడి భూములు రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను చేత్తో పట్టుకుని రెవిన్యూ చుట్టూ తిరిగితే నష్టతహారం వస్తుందని ప్రాజెక్ట్ పిఆర్ఓ చెప్పడంతో రైతులు ఆయన పైన అసహనం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చి మేము ఎందుకు తిరగాలి అంటూ రైతులు తిరగబడడంతో తప్పుదంటూ ఆయన చెప్పిన సమాధానం పై రైతు ఉద్యమ నాయకులు తిన్నెల పూడి వాగ్వాదం వేసుకున్నారు. 50 సంవత్సరాలుగా భూములు సాగు చేసుకుని శిస్తులు చెల్లించి ఉన్న రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వరని ఉద్యమ నాయకులు నిలదీశారు. దీంతో కొంతసేపు వివాదం చెలరేగింది. జిల్లా కలెక్టర్ కూడా మంచి వారని సమస్యను పరిశీలిస్తున్నారని అవసరమైతే ఆర్డీవో కూడా వినతి పత్రాలు ఇచ్చుకోవాలని పిఆర్ఓ చెప్పడంతో రైతులు ఖంగుతిన్నారు రైతులు సమిష్టిగా. కమిటీలు కమిటీ ఏర్పాటు చేసుకొని పోరాటం చేస్తామని సాగర మాల ప్రాజెక్టు నుండి ఎవరైనా మాతో కలిసి వస్తే న్యాయం జరుగుతుందని రైతు ఉద్యమ నాయకులు విజ్ఞప్తి చేయగా ప్రాజెక్ట్ సమాధానం చెప్పలేదు. నష్ట పరిహారం వచ్చేవరకు పనులు జరగనిచ్చే ప్రసక్తే లేదని రైతులు చెప్పారు.

# జీఎస్టీ పన్ను చెల్లింపు విధానంతో మెరుగైన సత్ఫలితాలు

- ఏడేళ్లలో గణనీయంగా పెరిగిన పన్ను చెల్లింపుదారులు
- భవిష్యత్‌లో ఎక్కువమంది సులభంగా పన్నులు చెల్లించేలా ప్రణాళిక
- దేశాభివృద్ధిలో జీఎస్టీది ప్రధాన భూమిక
- వ్యాపారులందరూ సకాలంలో పన్ను చెల్లించాలి
- సెంట్రల్ జీఎస్టీ ఏపీ కమిషనర్ పి.ఆనంద్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** భారత ప్రభుత్వం ఒకే దేశం - ఒకే మార్కెట్ - ఒకే పన్ను విధానం పేరుతో అమలుచేస్తున్న గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ (జీఎస్టీ)తో పన్ను చెల్లింపు విధానంతో మెరుగైన సత్ఫలితాలు అందిపుచ్చుకుంటున్నట్లు సెంట్రల్ జీఎస్టీ ఏపీ కమిషనర్ (ఆడిటింగ్ వింగ్) పి.ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. జీఎస్టీ పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి ఏడు వసంతాలు పూర్తయిన సందర్భంగా సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై శనివారం నగరంలోని ఓ హోటల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు బ్రాంచి సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఒకేవిధమైన గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) విధానాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జీఎస్టీ విధానం రాక ముందు కేవలం 70లక్షలు మాత్రమే పన్ను చెల్లింపుదారులు దేశంలో వుంటే ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అనగా 1.40 కోట్లకు చేరడం జీఎస్టీ విధానం ద్వారా సాధించిన ఫలితంగా ఆయన చెప్పారు. అలాగే జీఎస్టీ విధానం ద్వారా పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడంతో సరాసరి 14.5శాతంగా వున్న పన్నుమొత్తం 11.5శాతంగా తగ్గి పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గిందన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ విధానం కూడా చాలా సరళీకృతమైందన్నారు. వేగంగా జీఎస్టీ లైసెన్సులను మంజూరు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో 1200 రకాల వస్తువులు, 500 రకాల సేవల ద్వారా జీఎస్టీ పన్ను వసూలు అవుతుందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో జీఎస్టీ విధానం ద్వారా మరింత ఎక్కువమంది వ్యాపారులు, సంస్థలను సులభతర విధానంలో పన్నులు చెల్లించేలా, పన్నుచెల్లింపుదారుల సంఖ్యను పెంచి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా తమశాఖ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, బ్రిడ్జిలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు ఇతర మౌలిక సదుపాయాలు, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే సంక్షేమ పథకాల అమలులో జీఎస్టీ ద్వారా ప్రజలు చెల్లించిన మొత్తం ప్రధాన భూమిక పోషిస్తుందని ఆయన వివరించారు. ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.65వేల కోట్లు, అమరావతి రాజధాని నిర్మాణానికి 15వేల కోట్లు, పోలవరం అభివృద్ధికి రూ.10వేల కోట్లను కేటాయించిందని, ఈ డబ్బు అంతా కూడా జీఎస్టీ ద్వారా వసూలైందేనని, వ్యాపారులు, ప్రజల నుంచి వసూలు చేస్తున్న ప్రతి రూపాయిను కూడా ప్రజలకే ఖర్చుపెట్టేందుకు ప్రభుత్వాలు జీఎస్టీ పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపారాలందరూ జీఎస్టీ విధానం ద్వారా సకాలంలో కచ్చితమైన పన్నులు చెల్లిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలువురు ఆడిటర్లు అడిగిన ప్రశ్నలను కమిషనర్ విపులంగా నివృత్తి చేశారు. పలువురు ఆడిటర్లు, వ్యాపారవేత్తలు కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అర్థవంతంగా సాగిన ఈ చర్చావేదికలో నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.ఉషాకిరణ్, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ సిహెచ్ యువరాజేష్, డైరెక్టర్ కె.గురుబ్రహ్మం, దాసా లక్ష్మీనారాయణ, నెల్లూరు ఆడిట్ సర్కిల్ సూపరింటెండెంట్లు మల్లెల శ్రీనివాసరావు, ఎన్.జైనేంద్ర కుమార్, ఎన్ మార్కండేయ తదితర సూపరింటెండెంట్స్, ఇన్‌స్పెక్టర్లు, ఆడిటర్లు, వ్యాపారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌ను కలసిన టీడీపి నేతలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల తహసీల్దార్‌ను శనివారం జలదంకి టీడీపీ నాయకులు దగ్గు మాటి మాల్యాద్రిరెడ్డి, ఉప సర్పంచ్ కూరపాటి మాల కొండరెడ్డి. జలదంకి నూతన తాసిల్దార్‌గా నియమితులైన హేమంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జలదంకి మండలంలోని పలు సమస్యలు గురించి తెలిపారు. జలదంకి మండలంలోని ముఖ్యంగా రైతులకు సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజా సేవ చేయాలని తహసిల్దారును కోరారు.

### అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అక్కురాబాదు గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గురువారెడ్డి బిజెపి నాయకులు కప్పు వరపు వెంకటేశ్వర్లు రెడ్డి టీడీపీ నాయకులు సుబ్బారావు వెంగళరావు మండల జనసేన పార్టీ కన్వీనర్ అక్బర్ బాషాలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఏఎస్‌పేట తహసిల్దార్ శ్రీ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఇటీవల గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమి నుండి మట్టిని తరలించి కొంతమేర రోడ్డుకు వేశారని తెలిపారు అదే అదునుగా చూసుకొని ఇతర ప్రాంతాలకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు పేర్కొన్నారు. కావున అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మట్టిని అరికట్టాలని వారు కోరారు.

### తహసిల్దార్‌ను సన్మానించిన చిలకపాడు సర్పంచ్



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.స్వప్నను మండల పరిధిలోని చిలకపాడు పంచాయతీ సర్పంచ్ సిద్దంరెడ్డి రమాదేవి శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్దంరెడ్డి రమాదేవి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రైతులకు పలు సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేసేందుకు కృషి చేయాలన్నారు. వృత్తి ధర్మంలో ఎటువంటి ఆటంకాలు దరి చేరకుండా ఉండాలని కోరుకుంటూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజల యొక్క మన్ననలను ఆమె పుష్కలంగా పొందాలని కోరారు.

# అంబులెన్స్‌లను ప్రారంభించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర ప్రజలు అత్యవసర సమయంలో వినియోగించుకునేందుకు ఉచితంగా అంబులెన్స్ సర్వీస్‌లను సంస్కార ట్రస్టు చైర్మన్ చేవురు వెంకటస్వామి అధ్వర్యంలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శనివారం సంస్కార్ ట్రస్ట్‌కు సంబంధించిన అంబులెన్స్ లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు నగర పరిధిలో 5 కిమీ లోపల అనారోగ్య సమయంలో వారిని అత్యవసరంగా ఆసుపత్రికి చేర్చాలన్నా, ఎవరైనా మృతి చెందినప్పుడు వారి మృతదేహాలను ఇంటికి చేర్చేందుకు సంస్కార ట్రస్ట్‌ను అంబులెన్స్ లను వినియోగించుకోవచ్చునన్నారు. కొంతమంది అంబులెన్స్ ద్వారా విపరీతంగా చార్జీలు వసూలు చేస్తుంటారని, అలా కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అతి




తక్కువ రేట్లకు సంస్కార ట్రస్ట్ ద్వారా ఇతర ప్రాంతాలకు కూడా సేవలు అందుతాయన్నారు. తమ ట్రస్ట్ సేవల కోసం 8309507598ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నేత సురేందర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, బిజెపి నేతలు మొగరాల సురేష్, విజయ్, సంస్కార ట్రస్ట్, కార్యదర్శి పెళ్లూరు ధనయ్య, యనమల కృష్ణ, బ్రహ్మయ్య, జి. శ్రీనివాసులు బిరదవోలు సుభాష్, చేవూరు మారుతి, చల్లా భాస్కర్, జి.రాజు, పెంచలయ్య, కిట్టు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహా ఏర్పాటుకి స్థలం కేటాయించండి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని త్వరలో 9.వ మైలు సెంటర్‌లో ఏర్పాటు చేస్తామని ఎన్టీఆర్ విగ్రహానికి సంబంధించిన స్థలాన్ని వెంటనే కేటాయించాలని తహసిల్దార్ హేమంత్ కుమార్‌ని మండల టిడిపి సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ తల్లపనేని మధుసూదన్‌రావు కోరారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ.. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డిల సహకారాలతో త్వరలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేసి కేటాయించాలని వినతి పత్రం అందజేసి త్వరితగతిన అనుమతులను ఇవ్వాలని కోరారు. మండలంలో నెలకొన్న భూ సమస్యలను త్వరత గతిన పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో భూ సమస్యలు అనేకంగా ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించి ఆయా గ్రామాల ప్రజలకు బాసటగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు అధ్యక్షులు కొల్ల రాధాకృష్ణ, మాజీ ఎంపిటిసి మోదేపల్లి మాలకొండయ్య, దగ్గు మాటి మాల్యాద్రి రెడ్డి, మందలపు సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జ్ స్వర్ణ కొండప నాయుడు, ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండ రెడ్డి, గంట అశోక్, నిమ్మకాయల మురళి, వల్లెపు ఏడుకొండలుతదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం అదాని వరల్డ్ స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరం వైభవంగా శనివారం నిర్వహించారు. ప్రాథమిక చిన్నారులు రాధా కృష్ణ వేషధారణలో అలరించారు చిన్నారులు కృష్ణ శ్లోకాలతో భజన నృత్య కార్యక్రమం ఉట్టి మహెూత్సవంని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈ వేడుకల్లో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల విద్యార్థులు కృష్ణ గానంతో ప్రారంభమై చిన్నారులు భగవద్గీత శ్లోకాలతో వేదికపై పాడి అలరించారు. బృందావనాన్ని తలపించేలా నృత్యాలతో వీక్షకులను అలరించారు. 5వ తరగతి చదువుతున్న గాయత్రీ అను విద్యార్థి ముద్దుగారే యాశోద భరత నాట్యం ప్రదర్శన చూపారులను ఆకట్టుకుంది. 8తరగతి చదువుతున్న భవిష్య పిల్లన గ్రోవితో శ్రీకృష్ణాష్టకం ఆలపించి వీనులవిందు చేసి ప్రేక్షకులను మైమరపించే లా చేసింది. సాయంత్ర వేళలో ఉట్టి మహెూత్సవంలో



విద్యార్థుల పాల్గొని కార్యక్రమంను ఘనంగా ఆటపాటలతో నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. పాఠశాలలో విద్యాతోకూడిన సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో నూతన ఉతేజాన్ని విలువలతో కూడిన విషయాలను తెలియపరిచే విధంగా బోధన జరుగుతుందని తెలియజేయశారు. కృష్ణాష్టమి వేడుకల్లో పాఠశాల అకాడమిక్ హెడ్ రాబిన్, కో ఆర్డినేటర్స్ ఉష, దేవకీ, సుమన్, విద్యార్థులకి జన్మాష్టమి వేడుకుల గురించి తెలియజేయశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయ సహెూపాధ్యాయా బృందం పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుక



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకను నిర్వహించారు. చిన్నారి బాలబాలికలచే వివిధ వస్త్రదారణలతో ముచ్చట గొలిపే రూపాలను ధరించి నృత్యం చేశారు. పాఠశాలలో సర్వ మతాల పండుగలను నిర్వహిస్తూ యాజమాన్యం జాతీయ భావనను చిన్నారులలో, విద్యార్థులలో పెంపొందిస్తున్నారు. విద్యార్థుల ఎడల విద్యాపరంగా ప్రత్యేక దృష్టి సారిస్తూ, క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తూ, పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండల స్థాయిలో తమ విద్యార్థులు ప్రథమంగా నిలిచేలా కరస్పాండెంట్ ప్రభాకర్ మంచి పేరును పొంది ఉన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎంఈఓ టు కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి,విద్యా కమిటీ చైర్మన్ జి.రాధా తనిఖీ చేశారు. భోజన ఏర్పాట్లు రుచికరంగా ఉండాలని, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పలు ఫిర్యాదులు అందుతున్నాయని ఆమె నిర్వాహకులకు సూచించారు. భోజనాన్ని ఎంఈఓ చైర్మెన్లు రుచి చూశారు.సంతృప్తి వ్యక్తం చేసి రోజు ఈ తరహా ఏర్పాట్లు ఉండాలని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్‌ఎం జి.పెంచలయ్య, జి మధు తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు 25వ తేదీ జరుగుచున్నవి సిపిఎం పార్టీ మండల కార్య దర్శి పరిదిన్ భాష సిఐటియు మండల అధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావులు శనివారం పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆది వారం నుంచి మొదలవుతాయని ఈ శిక్షణా తరగతులకు పార్టీ సభ్యులు అందరూ పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో పార్టీ సభ్యులు అందరూ హాజరుకావాలని శిక్షణ తరగతులు జయప్రదం చేయాలన్నారు.

## సీఐకి ఘన సన్మానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందిన ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం కావ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షేక్ సికిందర్ మిత్రబృందం ఘనంగా సన్మానించి ఈ కార్యక్రమంలో సందాని అరాఫత్ శ్రీనివాసులు రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# సెంట్రల్ జైలు నుండి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి విడుదల

- స్వాగతం పలికిన మాజి మంత్రి కాకాని, పెద్ద ఎత్తున కార్యకర్తలు
- భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు



**నెల్లూరు క్రైమ్, మేజర్‌న్యూస్ :** వాళ్లు కేసుల్లో నెల్లూరు సెంటర్ జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శనివారం ఉదయం ఆయన సెంట్రల్ జైలు నుండి విడుదలయ్యారు. పిన్నెల్లకు వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి తాకాని గోవర్ధన్ రెడ్డి తోపాటు కొల్లూరు నాయకులు భారీ ఎత్తున కార్యకర్తలు జైలు వద్ద స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివస్తుండడంతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పిన్నెల్లి పై కక్షపూరితంగా కేసులు బనాయించారు : మాజీ మంత్రి కాకాని

మాచర్ల నియోజకవర్గంలో 4సార్లు తిరుగులేని విజయాన్ని సాధించిన పిన్నెలి రామకృష్ణారెడ్డిని చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా కేసులు బనాయించి జైలుకు పంపించారనీ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. జైలు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హై కోర్టు బెయిల్ మంజూరు చేసిందనారు. చంద్రబాబు, దొంగ కేసులు బనాయించి, తిరిగి జైలుకు పంపించే దుర్మార్గపు ప్రయత్నం చేస్తున్నాడన్నారు. చంద్రబాబు నాయుడుకి మంచి బుద్ధి ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం, ప్రజలు అధికారం ఇచ్చింది, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు చేస్తాడని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయకుండా, రాష్ట్రంలో కక్ష సాధింపులకు, విధ్వంసాలకు శ్రీకారం చుట్టాడని ఆరోపించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కరుడుగట్టిన జగన్మోహన్ రెడ్డి సైనికులు పనిచేస్తున్నారని, జైళ్లు, కేసులు పేరిట మమ్మల్ని ఎవ్వరూ భయపెట్టలేరన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు ఎదురవుతున్నాయి. రేపు అనేది ఉంది, అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదనారు. విధ్వంస పాలనకు వంత పాడేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

# విద్యార్థులు పోటీల్లో పాల్గొని వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవచ్చు




**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ శాఖ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల దర్గా మిట్నందు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించడమైనది. ఈ పోటీలకు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు, అదనపు డిహెచ్ఎంవో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ ప్రతి ఏడాది సుమారు 50 పైగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా తమ వ్యక్తిత్వాన్ని తాము మెరుగు పరుచుకోవడానికి దోహదం చేస్తాయని వారు పేర్కొన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 18 టీముల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ నందు వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల సంగం వారు ద్వితీయ బహుమతి అందుకున్నారు. మొదటి బహుమతిగా 7000 రూపాయలు, ద్వితీయ బహుమతిగా 5000 రూపాయలు నగదుతోపాటు సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ అధికారి పీబీజే రామారావు, అదనపు డిహెచ్ ఎంఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఎన్జీసీ కోఆర్డినేటర్ భక్తవత్సల బాబు నాయుడు, న్యాయ నిర్ణేతలుగా జీవ శాస్త్ర ఉపాధ్యాయులు హరిబాబు, విజయ ప్రసూన తో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఠాగూర్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ పాఠశాలలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ కె.రమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు డైరెక్టర్ కె.దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుని గోపికల వేషధారణలతో నృత్య ప్రదర్శనలు చేయడం జరిగింది. అదేవిధంగా చిన్ని కృష్ణులు వెన్నను దొంగలించి తినడం కృష్ణులు పిల్లలచే అడుగులు వేయించడం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ వైయస్సార్ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఎంపిక



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ఏపీ వైయస్సార్ ప్రభుత్వ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శనివారం నియమించారు. ఈ సందర్భంగా విషయం తెలిసిన పలువు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సంఘాల నేతలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్సార్ టీఏ రాష్ట్ర ఉపాధ్యాయ అధ్యక్ష బాధ్యతల అప్పగించడం ఎంతో సంతోషకరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పని చేస్తానని తెలిపారు. టీచర్లు, లెక్చరర్లు అందరితో కలిసి పనిచేస్తానని అన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కార దిశగా పోరాటం సాగిస్తానని తెలిపారు.

## వల్లూరులో సామాజిక సేవా కార్యక్రమాలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** చెన్నైకి చెందిన స్వచ్ఛంద సంస్థ శనివారం వల్లూరు గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించింది. నాగరాజు అనే వ్యక్తికి జీవనోపాధి కల్పిస్తూ స్వచ్ఛంద సంస్థ ద్వారా 45వేల రూపాయల ఖర్చుపెట్టి వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేయించింది. షాపు ప్రారంభోత్సవానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి డాక్టర్ పెంచలయ్య హాజరై ప్రారంభం చేశారు. ఆయన తోపాటు వైద్యాధికారులు ఖాదరవల్లి, స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు పేదలకు సాయం చేయాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థ చేసిన సహకారం ఆ కుటుంబానికి ఎంతగానో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో ముందస్తు కృష్ణాష్టమివేడుకలు



చిన్నారులకు వేషధారణల దృశ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీకేంద్రంలో కార్యకర్త షేక్ షకీలా ఆధ్వర్యంలో శనివారం ముందస్థు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా ఆకర్షణీయంగా నిర్వహించారు. సాంప్రదాయబద్దంగా పూజలు నిర్వహించారు. తమ అంగన్‌వాడీ చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధ, గోపిక తదితర వేషధారణలు గావించారు. అందరినీ ఈ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ విజయ, చిన్నారులు, వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవంటూ టీడీపీ నేత నిరసన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అక్రమకట్టడాలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ అందుకు నిరసనగా టీడీపీ నాయకుడు చల్లా రవికుమార్ రెడ్డి తన అనుచరులతో ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ ప్రవేశద్వారంవద్ద బైఠాయించారు. సాక్షాత్తు అధికారపార్టీ నేత నిరసనకు దిగడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. వివరాలు పరిశీలిస్తే మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలో ఒక ఇంటినిర్మాణం అనుమతిలేకుండా నిర్మిస్తున్నారని, ఆస్థలం కూడా వివాదంలో ఉందని, ఈవిషయమై తగు చర్యలు తీసుకోవాలని కమీషనర్‌కు ఫిర్యాదుచేసినా చర్యలు లేవంటూ నిరసనకు దిగారు. ఈవిషయమై సాక్షాత్తు మంత్రి కూడా తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారని, పోలీసులకు ఫిర్యాదుచేయాలని కూడా మంత్రి ఆదేశించినా అలా జరగలేదని చెబుతున్నారు. కాగా వైసిపికి చెందిన కొందరుకూడా టిడిపినేత బైఠాయింపులో పాల్గొన్నారన్న ప్రచారం సాగుతుంది. ఈ కార్యక్రమంలో చల్లా అనుచర కౌన్సిలర్ గంధళ్ళ వేణు, మాజీ కౌన్సిలర్ కంజుల పెంచలప్రసాద్‌రెడ్డి, పలువురు అనుచరులు పాల్గొన్నారు. బైఠాయింపు సమాచారం తెలుగుకున్న స్థానిక సీఐ అక్కడకు చేరుకొని కమీషనర్ అందుబాటులో లేనందున ఆయన వచ్చాక చర్చించుకుందామని, నిరసన విరమించాలని కోరగా చల్లా అక్కడనుండి విరమించారు. కాగా అధికారుల పరంగా చూస్తే అనుమతిలేకుండా సాగిస్తున్న నిర్మాణాన్ని 20రోజులపాటు ఆపామని, అయితే వారు కోర్టునుండి స్టే పొందారని, తమవంతుగా నోటీసు ఇచ్చామని, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని చెబుతున్నారు.



మున్సిపల్ కార్యాలయద్వారంవద్ద బైఠాయించిన టీడీపీ నేత చల్లారవికుమార్‌రెడ్డి, అనుచరులు

# హోరా హోరీగా రాష్ట్రస్థాయి వెటరన్ టీ-20 క్రికెట్ పోటీలు



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** వెటర్న్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వెటరన్ టి-20 క్రికెట్ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. శనివారం సీఐ ఏ క్రికెట్ మైదానంలో జరిగిన పోటా పోటీలో ఉదయం నెల్లూరు బస్సెస్ హైదరాబాద్‌లలో నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 143 పరుగులు సాధించి విజయం సాధించింది. మధ్యాహ్నం కడప వర్సెస్ అనంతపురం జెట్లూర్ పోటీ పడగా అనంతపురం జట్టు నిర్నిత 20 ఓవర్లలో 1037 పరుగులు సాధించి కడప జట్టుపై విజయం సాధించింది. నెల్లూరు జట్టులో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా సందీప్, అనంతపురం జట్టు నుంచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రదీప్ ఎన్నికయ్యారు. ఈ ఘటన క్రికెట్ పోటీలను క్రికెట్ అసోసియేషన్ నెంబర్ భాను ప్రకాష్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంపైర్లుగా ఆకులయ్య, సుదర్శన్, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, మోహన్, బాలు, చక్రి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, శీను, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రధమ స్థానం సాధించిన వింజమూరు విద్యార్థులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో వింజమూరు జడ్పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధమ స్థానం సాదించారు. సంగం జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాదించారు. నెల్లూరులో శనివారం ఎయిడ్స్ నివారణ నియంత్రణ శాఖ మరియు విద్యాశాఖలు సంయుక్తంగా నిర్వహించారు. పలు అంశాలపై జరిగిన యూత్ పెస్ట్ 2024 క్విజ్ పోటీల్లో షేక్. అఫ్జల్ వై.యశ్వంత్‌లు 7వేల నగదు బహుమతిని గెలుచుకొని 'రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రధమ స్థానం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపద్యాయుడు సిహెచ్. మాలకొండయ్య, జీవ శాస్త్ర అధ్యాపకుడు షేక్. అబ్దుల్ సలాంలు అబినందించారు.

# ప్రతిష్టాత్మకంగా వెంకటాచలం నగరవనం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ప్రతిష్టాత్మకంగా వెంకటాచలం నగరవనం రాష్ట్రంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని, అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెలుతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాతీయ రహదారికి పక్కనే వెంకటాచలం సమీపంలో నిర్మాణంలో ఉన్న నగరవనానన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై నుంచి నగరవనంలోకి అనుసంధాన మార్గం, హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు గురించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం కనుపూరు ఫారెస్ట్ ప్రాంతంలో 325 రకాల పక్షులు, 520 రకాల చెట్లు, 32 రకాల గడ్డిరకాలు ఉన్నాయని డీఎఫ్ఓ చంద్రశేఖర్ వివరించారు. రూ.5 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ నగర వనం ప్రాజెక్టులో రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్కు, విశాలమైన పార్కింగ్, అడ్వెంచర్ గేమ్స్, యోగా సెంటర్, థీమ్ బేస్డ్ ప్లాంటేషన్, ఆర్టిఫిషియల్ వాటర్ ఫాల్స్, బోట్ క్లబ్, ఓపెన్ జిమ్, మినరల్ వాటర్ ప్లాంట్ తదితర సౌకర్యకాలు కల్పించబోతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన రూ.2 కోట్లతోపాటు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1 కోటి మంజూరు చేయించడంతోపాటు వివిధ మార్గాల్లో నిధులు సమకూర్చేందుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ఆత్మకూరు ఎస్ఐగా జిలానీ బాధ్యతలు స్వీకరణ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఎస్ఐగా షేక్ జిలానీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న బి.ముత్యాలరావును ఇటీవల బదిలీచేసిన జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ఆత్మకూరుకు జిలానీని నియమించారు. దాంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆత్మకూరులో నేరాలఅదుపుకు, శాంతిభద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు తనవంతుగా చిత్తశుద్ధిగా కృషి చేస్తానని ఎస్ఐ జిలానీ పేర్కొన్నారు.

# వరుడిని ఆశీర్వదించిన టీడీపీ నాయకులు



వరుడు హరికృష్ణను ఆశీర్వదిస్తున్న తెలుగుదేశం నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ కౌన్సిలర్ గంధళ్ళ వేణు సమీపబంధువు చల్లా హరికృష్ణ వివాహ నలుగు మహోత్సవంలో శనివారం తెలుగుదేశం నాయకులు పాల్గొని ఆశీర్వదించారు. ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పట్టణ టిడిపి నాయకుడు గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, కౌన్సిలర్ గంధళ్ళ వేణు తదితరులు పాల్గొన్నారు. వారంతా హరికృష్ణను ఆశీర్వదించి వివాహమహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో ఇసుక పంపిణీ వివరాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో శనివారం 106 ఇసుక బుకింగ్ ఆర్డర్లు వచ్చినట్లు జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నిల్వకేంద్రంలో 1022.5 మెట్రిక్ టన్నుల ఇసుకను వచ్చిన ఆర్డర్ల మేరకు సరఫరా చేయగా 30441 మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇసుక పంపిణీకి సంబంధించి 13 ఫిర్యాదులు రాగా 13ను పరిష్కరించగా నూరుశాతం ఫిర్యాదిదారులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన చెప్పారు. ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. మర్రిపాడు తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన బుకింగ్ కేంద్రం ద్వారా మాత్రమే ఇసుక ఆర్డర్ బుక్ చేసుకుని ఇన్వాయిస్ కలిగిన వాహనాలను మాత్రమే ఇసుక నిల్వ కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఒక మెట్రిక్ టన్ను ఇసుకను రూ.370/-కు స్టాక్‌యార్డులో అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 0861-2943569కు సంప్రదించాలని ఆయన కోరారు.

# ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని శ్రీ వివేకానంద హైస్కూల్, రవి హైస్కూల్ నందు శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలకు సెలవు కావడంతో మందస్తుగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణుడు 'యశోద' వేశధారణతో పిల్లలు చూపరులను ఆకట్టుకున్నారు కృష్ణుడు బలరాముడు యశోదతో చేసే చిలిపి చేష్టలు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించారు.

అందరికీ ఆపద్బాంధవుడు భగవంతుడు ఎవరికి ఏ కష్టం వచ్చినా అతనికి మొక్కుకుంటారు. అయితే దేవునికి నేడు కష్టమొచ్చింది.. తనకు చెందిన విలువైన భూములను ఆక్రమణకు గురవుతుంటే ఏమి చేయాలో.. ఎవరికి మొక్కుకోవాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. వివరాలకెళితే..

- ఆలయ భూములను ఆక్రమించేస్తున్నారు
- దేవాదాయ శాఖ మంత్రి జిల్లాలోనే అరాచకం



# దేవుని భూములకు దిక్కెవరు..?



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :**
ప్రకాశం జిల్లా పామూరులో వెలసియున్న మదన వేణు గోపాలస్వామి, వల్లిసమేత భుజంగేశ్వర స్వామి ఆలయ దేవస్థానంకు పామూరు పరిసర ప్రాంతాల్లో విలువైన భూములున్నాయి అయితే ఈ మద్య కాలంలో ఈ భూములు కొట్టేసేందుకు బడా నేతలు పన్నాగాం పునారు. వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 78/1లో 6.06 ఎకరాల కోట్లు విలువైన భూమి ఉంది. అయితే పామూరుకు చెందిన కొంతమంది బడా నేతలు ఆ భూమిని ఆక్రమించేదుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ శనివారం ఆ భూమిలో జేసీబీలు పెట్టి చెట్లు తొలగిస్తున్నారు. ఆ భూమిలో దేవాదాయ శాఖ బోర్డును ఏర్పాటు చేయగా శనివారం ఆ బడా నేతలు తొలగించి, జేసీబీలతో చెట్లు తొలగిస్తూ దేవాలయ భూమిని ఆక్రమించారు. సదరు భూమి గతంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ కోర్టులో ఇరు వర్గాల వాదన అనంతరం ఆ భూమి శ్రీ మదన వేణుగోపాల స్వామి ఆలయానికి చెందినదే అని జాయింట్ కలెక్టర్ తీర్పునిచ్చారు. అయితే ఇటీవల ఆ బడా నేతలు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఆ స్టేలో తీర్పు వచ్చేంతవరకు ఎవరు భూములకు పోవద్దని ఉండగా కోర్టు ఆదేశాలు దిక్కరిస్తూ ఆక్రమణదారులు భూమిలో ఒక ప్రవేశించడం, అందులో ఉన్న చెట్లు తొలగించడం కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. ఈ విషయంపై వేణుగోపాల స్వామి కార్యనిర్వహణాధికారి వరికుంటపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దేవుని భూములకే పెసరపెట్టిన ఆ పడానేతలకు అండదండలు ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. స్వయాన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సొంత జిల్లాలోని దేవుడి మాన్యాలను కాపాడుకోలేని పరిస్థితి నెలకొనడం భక్తుల నోట బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 20 కోట్ల రూపాయల భూమి ఆక్రమణదారులకు దారా దత్తమవుతుందా? లేక ఆ దేవుడే ఆ భూములను కాపాడుకుంటాడా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.


సూర్య www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, రాపూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811

## 30 టీఎంసీలకు చేరిన నీటిమట్టం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయంలో ఆశించిన విధంగా నీటిమట్టం శనివారం సాయంత్రానికి 30 టీఎంసీలకు చేరుతుంది. సోమశిల ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు క్రమక్రమంగా పెరుగుతూ జలాశయానికి వచ్చి చేరుతోంది. రెండు రోజుల క్రితం 11 క్యూసెక్కులుగా ఉన్న వరద తాకిడి 12వేల నుంచి ఒక్కసారిగా 16,900కు పెరిగింది. జలాశయం నుండి కండలేరు రిజర్వాయర్కు ఎస్ కె ఎఫ్ఎఫ్‌సి కెనాల్‌లోని ఆర్ హెచ్ ఆర్ గేటు ద్వారా 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బాలాజీ పవర్ ప్లాంట్ ద్వారా పెన్నా డెల్టాకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# నిండని చెరువు.. రైతు గుండె బరువు !

- ముఖం చాటేసిన నైరుతి
- మేఘాల దోబూచులాట.. అన్నదాతల్లో ఆందోళన
- వర్షం కోసం ఎదురుచూపు.. పంటలపై తీవ్ర ప్రభావం
- ఎండుతున్న వర్షాధార పంటలు

**సీజన్ ప్రారంభమైంది.. మంచి వర్షాలు కురుస్తాయని అనుకున్నారు.. అడపాదడపా ఆశలు రేకెత్తించాయి.. వేడి గాలులు పోటెత్తుతున్నాయి.. తడి ఆరిపోయింది.. మేఘాలు దోబూచులాడుతున్నాయి.. చినుకు నేల రాలింది లేదు.. పొలం తడిసింది లేదు.. అన్నదాతల్లో ఆందోళన.. పంటలపై తీవ్ర ప్రభావం.. ఆకాశం వైపు ఎదురుచూపే మిగిలింది.**

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :**
జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజక వర్గాల మెట్ట రైతులకు వర్షాధారమే ఆధారం. ఈ నియోజకవర్గాల్లో ఎటువంటి జల వనరులు లేని పరిస్థితి. ఈ తరుణంలో వర్షాధారం వల్లనే చెరువులు నిండితే గాని వ్యవసాయ పనులు సాగని దుస్థితి. ఎన్ని ప్రభుత్వాలు మారినా సాగు, త్రాగునీరు కరువైన ప్రాంతాలు ఇవి. సాధారణంగా నైరుతి రుతుపవనాల వల్ల వర్షపాతం నమోదవుతూ ఉండేది. అప్పటిలాగే ఇప్పుడు కూడా నైరుతి కరుణిస్తుందిలే అనుకున్న తరుణంలో ముఖం చాటేయడంతో మెట్ట రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారయింది.

నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. అన్నదాతలు వ్యవసాయ పనులు పై దృష్టి పెడతారు. ఈ ఏడాది నైరుతి త్వరగా ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలోవర్షాలు పడలేదు. ప్రారంభంలో అడపాదడపా కురిసి అన్నదాతల్లో ఆశలు రేకెత్తించాయి. రైతులు పొలం పనులకు సిద్ధమయ్యారు. ఈ రెండు నియోజకవర్గాల్లో అక్కడక్కడ వేరుశెనగ విత్తనాలు విత్తారు. మరోపక్క ఉద్యానవన పంటల సాగుకు సిద్ధం చేసుకున్నారు. జూన్ జూలై ఆగస్టు నెలలో పూర్తవుతున్న చినుకు జాడ కనిపించడం లేదు. ఇంకేముంది అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. నియోజకవర్గాల్లోని వాగులు వంకలు, చెరువులు నిలువునా ఎండి దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ బోర్డులకు సైతం నీరు అందని పరిస్థితి నెలకొంది. బోరు బావుల కింద టమోటా బీన్స్ వరి చిక్కుడు బంతి మిరప కాకర తదితర పంటలు రైతులు సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు కూడా రోజురోజుకు తగ్గుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో బోరు బావులు అడుగంట టంతో పంటలు ఎండు ముఖం పట్టాయి. వాతావరణ అనుకూల పరి స్థితులు లేనందున సాగులో ఉన్న పంటలకు కూడా చీడపీడల బెడద ఎక్కు వైంది. వాటి నుంచి బయట పడడానికి ఎరువులో అత్యధిక సంఖ్యలో వాడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడులు కూడా రెట్టింపు అవుతున్నాయి. వర్షపాతం నమోదు కాకపోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు మేఘాలు, దోబూచులాడుతున్నాయే తప్ప చినుకు రావడం లేదని రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.



చుక్క నీరులేని కదిరినేనిపల్లి చెరువు

భారీగా వర్షం వచ్చేలా మేఘావృతం అవుతుంది. కానీ పట పట నాలుగు చినుకులు రాలిఆగిపోవడం జరుగు తుంది. ప్రధానంగా ఈ మండలాల్లో పత్తి మిరప వరి తదితరు పంటలు ప్రస్తుతం సాగులో ఉన్నప్పటికీ వాటికి సాగునీరు అందించలేక రైతులు నానా తంటాలు పడుతున్నారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత విపరీతంగా ఉన్నందున పంటలకు బెట్ట సోకి నిలువునా ఎండిపోవడం ప్రారంభమైంది. ఏది ఏమైనప్పటికీ రాబోయే అది కొద్ది రోజుల్లో వర్షపాతం నమోదు కాకపోతే ప్రస్తుత ఏడాది వ్యవసాయం చేయడం గగనమేనని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ పొలాలను దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఇక వరుణుడి రాక కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తూ ఉన్నారు.



సాగునీరు లేక ఎండుతున్న మిరప పంట



వ్యవసాయానికి సిద్ధంగా ఉన్న దుక్కి దున్నిన పొలం